క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 41 మంది పయనం



నేత్ర శస్త్రచికిత్సకు బస్సులో విశాఖకు వెళ్తున్న వృద్ధులు

రాజాం సిటీ: నేత్ర శస్త్రచికిత్సకు 41 మందిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌కు గురువారం పయనమైనట్లు ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో ఇటీవల నిర్వహించిన నేత్రవైద్య పరీక్షల్లో వారికి ఆపరేషన్ అవసరమని గుర్తించి, ఇప్పుడు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి



ఎంపీడీఓకు సూచనలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుపై గురువారం సమీక్షించిన ఆయన 2023–2024 ఏడాదికి సంబంధించి, పంచాయతీల అభివృద్ధికి రూ.60 లక్షలతో ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, సీనియర్ అసిస్టెంట్ ఎ.మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జక్కువలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మెంటాడ: మండలంలోని జక్కువ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

సోషల్ ఆడిట్‌పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల్లో నిర్వహించాల్సిన సోషల్ ఆడిట్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ టి.సురేష్‌కుమార్ ఆడిట్ చేయాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.


చురుగ్గా హద్దురాళ్ల ఏర్పాటు

బాడంగి: భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు చాలా చురుగ్గా జరుగుతోంది. మండలంలోని భీమవరం, పిండ్రంగివలస గ్రామాల్లో ప్రస్తుతం హద్దురాళ్ల ఏర్పాటు జరుగుతుండగా, ఆయా గ్రామాల పొలాలకు హద్దురాళ్లు తరలించే పనులను తహసీల్దార్ బాలమురళీకృష్ణ పరిశీలించారు. మండలంలో మొత్తం 29 గ్రామాల్లో 21 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మొత్తం 26,219 సర్వే రాళ్లు వచ్చాయన్నారు. రైతుల సమక్షంలో సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేసి, భూ తగాదాలు పరిష్కరించాలన్నారు.

సక్రమంగా జగనన్న గోరుముద్ద పథకం అమలు

తెర్లాం: జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని ఎంఈఓ జె.త్రినాధరావు అన్నారు. మండలంలోని చుక్కవలస, నెమలాం గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం సందర్శించిన ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేసిందని, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రోన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో డ్రోన్ సర్వేను తహసీల్దార్ డోల రాజేశ్వరరావు గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో ఎన్నో ఏళ్ల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. ప్రస్తుతం డ్రోన్ కెమెరాతో గ్రామంలోని రైతులకు చెందిన పల్లం, మెట్టుభూములతో పాటు, ప్రభుత్వ భూములు, గ్రామకంఠాల భూములకు సంబంధించిన చిత్రాలను తీస్తున్నామన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం విడుదల చేసిన పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సిబ్బంది, తల్లిదండ్రులు, బంధుమిత్రులు అభినందించారు. స్వీట్లు తినిపించి, తమ ఆనందాన్ని పంచుకున్నారు.

- ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అత్యుత్తమ మార్కుల సాధన
- ఆనందోత్సాహాల్లో విద్యార్థులు
- టాపర్లను అభినందిస్తున్న సిబ్బంది, తల్లిదండ్రులు



వంగర: 971 మార్కులతో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా టాపర్‌గా నిలిచిన నాగమణికి స్వీట్లు తినిపించి, అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

వంగర: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కరణం నాగమణి అనే విద్యార్థిని ఎంపీసీ గ్రూపులో 971 మార్కులు సాధించి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే కళాశాలకు చెందిన మరో విద్యార్థిని పెనుబోతు శిరీష ఇంటర్మీడియట్ ఫస్టియర్ సీఈసీలో 500 మార్కులకు 467 మార్కులు తెచ్చుకుని, కళాశాల ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు అభినందించి, స్వీట్లు తినిపించారు.



జి.రమ్య, సీఈసీ (467/500)



పి.శిరీష, ఎంపీసీ (446/470)



జి.ఉష, సీఈసీ (435/500)



ఎస్.దుర్గాబాయి, సీఈసీ (427/500)

రాజాం: పట్టణ పరిధిలోని సారధి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభను చాటుకున్నారు. సెకెండియర్‌లో 84 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించినట్లు సిబ్బంది తెలిపారు. పాసైన వారిలో చాలా మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఎం.తనూజ ఎంపీసీ విభాగంలో 893 మార్కులు, ఎస్.రమణమ్మ 849 మార్కులు, ఎం.కనకమహాలక్ష్మి 827 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో వై.స్నేహలత 807 మార్కులు, బి.శైలజ 757 మార్కులు, టి. స్వప్న 739 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో పి.హేమలత 853 మార్కులు సాధించగా, ఎం.సంధ్య 828 మార్కులు, పి.లక్ష్మి 779 మార్కులు సాధించారు. మంచి ఉత్తీర్ణతాశాతంతో పాటు మంచి ఫలితాలు ఈ కళాశాల సాధించడంతో కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మిని, విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే కంబాల జోగులు అభినందించారు.



ఎం.తనూజ, ఎంపీసీ-893



ఎస్.రమణమ్మ, ఎంపీసీ-849



వై.స్నేహలత, బైపీసీ-807



పి.హేమలత, సీఈసీ-853

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న కేజీబీవీ విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫస్టియర్‌లో తొమ్మిది మందికి ఆరుగురు ఉత్తీర్ణత చెందగా, సెకెండియర్‌లో 25 మందికి 22 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రోహిణి గురువారం వెల్లడించారు.



బి.క్రిష్ణకుమారి, సీఎస్ఈ, 925



ఎ.సరస్వతి, సీఎస్ఈ, 414

గురుకుల విద్యార్థుల ప్రతిభ..

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఫస్టియర్‌లో 69 శాతం, సెకెండియర్‌లో 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు గురువారం తెలిపారు.



జి.షన్ముఖరావు, సీఈసీ-892



టి.అజయ్‌కుమార్, ఎంఈసీ-782



వై.సురేష్‌కుమార్, సీఈసీ-439



నితీష్‌కుమార్, ఎంఈసీ-420

బాడంగి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక గురుకుల, ప్రభుత్వ జూనియర్, కళాశాలలతో పాటు కేజీబీవీ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి, ప్రతిభ చాటారు. ఈ మేరకు విద్యార్థులను సిబ్బంది స్వీట్లు తినిపించి, అభినందించారు.



అనూష, బైపీసీ- 924

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ



రాజాం: విజయసుశీలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా నాయకురాలు యందవ విజయసుశీలను ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. స్థానిక మాదిగ వీధిలో నివాసముంటున్న ఆమె ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను గురువారం కలిసి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని, యథావిధిగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, నాయకులు టి.తిరుమలరావు, టి.రాజారత్నం, వై.చినబాబు పాల్గొన్నారు.



రేగిడి: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శాసపు విజయలక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం పరామర్శించారు. ఆమె భర్త అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ గ్రామానికి గురువారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పలనాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాసపు జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రామభద్రపురం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏపీఎంఐపీ పీడీ పి.ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో రైతులు బోటు స్వరూప, బోటు విష్ణుప్రియ చేస్తున్న ఆయిల్ పామ్ సాగులో ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన బిందుసేద్యం పరికరాలను గురువారం ఆయన పరిశీలించారు. బిందుసేద్యం, తుంపరసేద్యం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. బిందుసేద్యం ద్వారా సాగుకు అనువైన పంటలు ఎంచుకోవాలని, చిన్న,సన్నకారు(5 ఎకరాల్లోపు భూమి ఉన్న) రైతులకు ప్రభుత్వం బిందుసేద్యం పరికరాలను 90 శాతం, తంపరసేద్యం పరికరాలను 55 శాతం రాయితీపై అందజేస్తోందన్నారు. 5 ఎకరాలు పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీపై బిందుసేద్యం, 45 శాతం రాయితీపై తంపర సేద్యం పరికరాలను ఇస్తోందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ

బొబ్బిలి: మండలంలోని ఎ.వెలగవలస, శివడవలస గ్రామాల్లో రైతులు చేస్తున్న బిందుసేద్యంను ఏపీఎంఐపీ పీడీ పి.ఎస్.లక్ష్మీనారాయణ గురువారం పరిశీలించారు. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న తుంపర, బిందుసేద్యాల పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీరు-చెట్టు పేరుతో టీడీపీ దోపిడీ

- మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు

రాజాం: సెల్ఫీ చాలెంజ్ పేరిట టీడీపీ చేస్తున్న కార్యక్రమం అంతా బూటకమేనని, గతంలో నీరు–చెట్టు పథకం పేరుతో టీడీపీ ప్రజాధనాన్ని దోచుకుందని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేకపోయిందని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకపోతోందని ఆరోపించారు. రాజాం నియోజకవర్గంలో అభివృద్ధికి అప్పట్లో చిల్లుగవ్వ కూడా టీడీపీ వెచ్చించలేదని, టిడ్కో కాలనీ ఇస్తామని ప్రజల నుంచి డబ్బులు తీసుకుని, నిర్మాణాలను అర్ధాంతరంగా వదిలేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, ఇళ్లు నిర్మించి ఇస్తోందన్నారు. రాజాంలో ప్రధాన రోడ్డు విస్తరణతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకూ ఇంటింటికీ కుళాయిలు వేయించిన ఘనత, పేదలకు పక్కా ఇళ్లు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గతంలో గ్రామాల్లో కనీస మౌలిక వసతులు, అధికారులు ఉండేందుకు కార్యాలయాలు ఉండేవి కాదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ పంచాయతీలో రూ.కోటితో సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్క్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రతీ పంచాయతీలో పది నుంచి 20 మంది గ్రామ వలంటీర్లు, 11 మందికిపైగా సచివాలయ ఉద్యోగులు ఉన్నారన్నారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా ఏం అభివృద్ధి జరగడం లేదని ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ నేతలు చేస్తున్న సెల్ఫీ చాలెంజ్ కార్యక్రమం దారుణమన్నారు. అయితే వారి మాటలను ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాజాం వ్యవసాయ సలహామండలి చైర్మన్ కోనారి అప్పారావు, పార్టీ నేతలు యాలాల వెంకటేష్, వంజరాపు విజయ్‌కుమార్, గెడ్డాపు అప్పలనాయుడు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ప్రభుత్వం పంపిణీ చేసిన స్టీలుగ్లాసులను ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు చేపడుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తున్న రాగిజావ కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన స్టీలుగ్లాసులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులందరికీ వీటిని ఉచితంగా ఇచ్చేందుకు దాదాపు రూ.80 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అలాగే పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఇప్పటికే మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారాం కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పాఠశాల విద్యార్థుల చదువు ప్రోత్సహించేందుకు జగనన్న అమ్మఒడి కింద పిల్లల తల్లిదండ్రుల ఖాతాలో ఏటా రూ.18 వేల నగదు జమ చేస్తున్నారని, అలాగే కళాశాలల విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, ఉన్నత, విదేశాల్లో విద్యనభ్యసించేందుకు జగనన్న విదేశీ విద్యాదీవెన పేరిట పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, ఇది ప్రభుత్వ పనితనానికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి, ఎంఈఓ తిరుమల ప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన 2,967 స్టీలుగ్లాసులను ఎంఈఓ వై.దుర్గారావు ప్రధానోపాధ్యాయులకు గురువారం అందజేశారు. జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ తాగేందుకు వీటిని అందజేసినట్లు ఎంఈఓ తెలిపారు.

28న మండల సర్వసభ్య సమావేశం

బొబ్బిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్లు భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వాహనాల వేలం రేపు

బొబ్బిలి: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ ఆర్.జైభీమ్ గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొని, వాహనాలను సొంతం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా...

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో స్నేహం అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని టౌన్ సీఐ కె.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు గురువారం ప్రారంభించారు. అనంతరం అటువైపుగా వెళ్తున్న పలువురికి గ్లాసులతో మజ్జిగ అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు. సేవా కార్యక్రమాల్లో స్నేహం అసోసియేషన్ సంస్థ సేవలు అభినందనీయమని, రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఉపేంద్ర, అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సత్యసాయి భక్తులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం గురువారం ప్రారంభించారు. అనంతరం పాదచారులు, ప్రయాణికులకు గ్లాసులతో మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి తీవ్రత తగ్గేవరకూ ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని, భక్తులు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోర్ల మరమ్మతులు

మెంటాడ: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను యుద్ధప్రాతిపదికన బాగు చేస్తున్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో పాడైన రెండు బోర్లను మెకానిక్‌లు గురువారం బాగుచేసి, తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఏపీ క్రిస్టియన్ జేఏసీ గౌరవాధ్యక్షుడిగా తిమోతిరాజు

మెంటాడ: ఏపీ క్రిస్టియన్ జేఏసీ(జాయింట్ యాక్షన్ కమిటీ) గౌరవాధ్యక్షుడిగా పాస్టర్ తిమోతిరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన జేఏసీ అధ్యక్షుడు జాషువాకు గురువారం మీడియా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. క్రిస్టియన్ల హక్కుల సాధనకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

బొబ్బిలి: మండలంలోని సీతయ్యపేట, గోపాలరాయుడిపేట గ్రామాల్లోని జగనన్న కాలనీలు, లబ్ధిదారుల సొంత స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లను క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ అధికారి విజయేంద్ర గురువారం పరిశీలించారు. ప్రతీ పేదవాడు సొంతిల్లు కలిగి ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, నాణ్యతా ప్రమాణాల మేర నిర్మాణాలు చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని వస్త్రపురి కాలనీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండపేటకు చెందిన ఎస్.చిన్నారావుకు గాయాలయ్యాయి. డ్యూటీకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆయన కాలికి గాయమైంది. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి, ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రక్తదానానికి ముందుకు రావాలి

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి సంస్థ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, రక్తదానానికి ముందుకు రావాలని సంస్థ అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి ఓ ప్రకటనలో గురువారం కోరారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో రక్తదానంపై అపోహలు వీడి, యువతీ యువకులంతా ఉత్సాహంగా పాల్గొని, రక్తం దానం చేయాలన్నారు.

సీఎం జగన్ వెంటే అన్ని వర్గాల ప్రజలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అలజంగి గ్రామంలో పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయమని, ఆయన అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటికీ న్యాయం జరుగుతోందన్నారు. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల్లోని ప్రజలను సంతోషంగా ఉంచుతున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని, తనను ఆశీర్వదించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ రేజేటి భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

జగనన్నకు జనం జేజేలు...

వాడవాడలా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా జై.. జగన్.. జయహో.. వైఎస్సార్ సీపీ నినాదాలతో పార్టీ శ్రేణులకు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీకి పాలనలో ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్న జగనన్న సర్కారును వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న గృహసారథులు



రేగిడి: కె.ఎం.వలసలో మా నమ్మకం నువ్వే జగన్ అని స్టిక్కర్లు చూపిస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్‌మోహన్



రాజాంలో ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ లలితకుమారి



రామభద్రపురం: కోటశిర్లాంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథుల ప్రచారం



రాజాం సిటీ: బొద్దాంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, గృహసారథులు



వంగర: సంగాంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ